పుష్పములు కోయుట మాని మఱియొకచోటికిం బోయితిని. పిమ్మట నీవు నింటికిఁ బోయితివికదా! అప్పుడు నే నితం డొక్కఁడు నేమిచేయుచున్నాఁడో చూతమని మరలివచ్చి యచ్చటి కొమ్మలసందున డాగి యాప్రదేశమును జూచితిని కాని యతం డందు గనంబడలేదు.

మే మిరువురము పుట్టిననాఁటనుండియు నొకక్షణమైన నెడఁబాసి యుండలేదు. కావున సుహృత్స్నేహాతరత్వంబున హృదయంబు దొట్రుపడుచుండ నిట్లు తలంచితిని.

అయ్యో! నామిత్రుఁడు మదనపరాయత్తచిత్తుండై యామత్తకాశిని వెంటఁబోయి తిరిగి నాయొద్దకు వచ్చుటకు సిగ్గుపడియెఁగాఁబోలు, లేక కోపముచేత నన్నువిడిచి యెచ్చటికేనింబోయెనేమో! ధైర్యస్ఖలనవిలక్షుఁడైన యతం డేమైపోయెనోకదా యని యమంగళము తలంచుకొనుచుఁ దరులతాగహనములు, చందనవీధులు, లతామంటపములు, సరఃకూలములు మొదలగు ప్రదేశములు పెద్దతడవు తద్దయు శ్రద్ధతో వెదకినది.

అంత నొకసరస్సమీపమందు లతామంటపమున చిత్తరువు మాడ్కి స్తంభితునిపగిది యోగస్థునిభంగి కదలక మన్మథశాప భయంబునఁబోలె నణఁగి నిష్పందనిమీలితమగు కందోయినుండి బాష్పజలము ధారగా వెడలుచుండ హృదయమునఁ బ్రజ్వరిల్లు మదనాగ్నిజ్వాలను గైకొని వెడలు నిట్టూర్పు గాడ్పులచేఁ బ్రాంతలతాకుసుమకేసరముల వాడఁజేయుచు వామకరతలంబునఁగపోలం బిడుకొని యున్మత్తునిక్రియఁ బరాయత్తచిత్తుండై యున్న పుండరీకుం గంటిని.

అపగతనిమేషము లగు చక్షుస్సులచేఁ దదవస్థ యంతయుం జూచి హృదయంబున విషాదంబు జనింప నిట్లు తలంచితిని.

మన్మథుఁడు దుర్నివారవేగముగలవాఁడు కదా! నిమిషములో నితనిదీర్ఘరానియవస్థ పాలుచేసెను. అన్నన్నా! జ్ఞానరాసియంతయు

కాదు. అబలాజనముయొక్క హృదయము మృదువైనను ముక్తా ఫలత్వము నొందిన జలమువలె నుత్కంఠితమయి కఠినమగునని తలంచె దను. కానిచో నామెచిత్త మెన్ని వ్యసనములు జెందినను సశింప కున్నది. అహా! స్త్రీలకు వల్లభసమాగమాశ దురంతమయినదికాదా! అట్టి కష్టములతోడ నయిన బ్రాణముల ధరించియున్నది.

రాజకుమారా! అత్యుత్కటమైన యాకాంక్షకంటె యుత్కంఠ నీతో నేమి చెప్పుదును? ఏయుపాయంబునఁ బ్రదర్శింతును? దేని తోఁ బోల్చి చెప్పుదును? ఆమె తాపంబు ప్రచండ దినకర సహస్రాత పమును మించియున్నది. శయనముగా వేయబడిన పద్మపత్రము లెండిచూర్ణములై పోవుచున్నది. కామునిచే మథింపఁబడు నా యా చేష్టలం జేయుచున్నది. వినుండు. మదనవేదన సహింపఁజాలక పరితపించుచుండి సఖులు కుసుమశయనంబునఁ బరుండఁబెట్టి కిసలయ తాళవృంతముల వీచుచు సంతాపముచేఁ జూర్ణమైన యలక్తకరసం బున నెఱ్ఱఁబడిన శయనకుసుమంబులం జూచి కుసుమశర ప్రహార జనిత రక్తమని యడలుచుందురు. మీ పేరు తలపెట్టినంత మేనఁగవచము వలె రోమాంచము వహించును. ఆమె యవస్థయంతయుం జెప్పుటకుఁ బది దినములు పట్టును. పెక్కులేలా? అక్కడి కథలన్నియుఁ ద్వదా లాపముఖరితములై యున్నవని యెఱింగించుటయుఁ జంద్రాపీడుఁడు కేయూరకా! చాలు చాలు. పైనఁ జెప్పకుము. వినలేకున్నానని పలుకుచుఁ గన్నులు మూసికొని మూర్ఛయావేశింపఁ గాదంబరిని ధ్యానించుచున్నవాఁడుం బోలె. ముహూర్తకాలము మేనెఱుంగక యంతలో దెలిసిగద్గదాక్షరముగా నతని కిట్లనియె.

కేయూరక! పత్రలేఖవలననే కాదంబరీ సంతాపమంతయుఁ దెలిసినది. నేనేమి చేయుదును? కాదంబరియొక్క యాజ్ఞనే నిర్వహిం పుము. అధరస్పందమాత్రముననే నియోగములను జేయుచున్న

గలుగదు. తురగ యానంబునఁబోయిన నాకేమియు నాయాసము గలుగదు. గమనాభ్యనుజ్ఞ యిమ్ము. నేనుబోయి ప్రియమిత్రునిం దీసి కొని వత్తును. అతండు రానిచో నేనుసైత మచ్చటనే యుండెదనని పలికిన విని శుకనాసుఁడు తారాపీడునితో దేవా! యువరాజుగ మనమునకు విజ్ఞాపన జేసికొను చున్నావాఁడు. సెలవేమియని యడిగిన నతం డిట్లనియె.

ఆర్యా! మన మొకటి దలఁచి కొనియుండ దైవము వేరొకటి తెచ్చిపెట్టెను. కానిమ్ము. వైశంపాయను నవశ్యముగా యువరాజు దీసికొనిరావలయును. అతని విడిచి యీతఁ డొక నిమిషమైనఁ దాళ లేఁడు. తప్పక పోవలసినదే. యతని దీసికొనివచ్చుటకు నాయుష్మంతుని మాట జెప్పనేల. విలాసవతినైనఁ బంపెదను సుమీ యని పలికి దైవజ్ఞులరప్పించి యప్పుడే ప్రయాణమునకు ముహూర్తము నిశ్చయించి పిమ్మటఁ జంద్రాపీడునిం జూచి రాజు వత్స! నీవీ వార్త మీ తల్లికిం జెప్పి వేగపొమ్మని పలుకుచు శుకనాసునితోఁగూడ దన భవనమునకుఁ బోయెను.

తరువాత నా రాజకుమారుఁడు తల్లియొద్దకుఁబోయి నమస్క రించుచు దాపునం గూర్చుండి మిక్కిలి విచారింపుచున్న మనోరమ కిట్లనియె. తల్లీ! నీవుల్లంబునఁ జింతిల్లకుము. వైశంపాయనుని దీసికొని వచ్చుటకు మా తండ్రి నా కానతిచ్చెను. నేను వెళ్ళి యల్పకాలములో నాతనిం దెచ్చెదను. నీవుగూడ ననుజ్ఞయిమ్ము. పోయివచ్చెదననుటయు నామె యిట్లనియె.

వత్సా! నేను వెళ్ళెదనను మాటచే నాకు శోకోపశమనము జేసెదవేల? నాకు నతనియందుకన్న నీయందు మక్కువ మెండు. నీవు పోయిన నెవ్వరిజూచికొని ధైర్యమవలంబింతును? నీవు పోవలదు.

మేఘనాధ! అచ్ఛోదసరస్తీరంబున నీకు వైశంపాయనుఁడు కనంబడియెనా ? చూచి మాట్లాడితివా ? ఏమనియెను ? ఇప్పటికైనం బశ్చాత్తాపముజెంది యింటికి రావలయునని తలంచుచున్నవాఁడా ! నా మాటయేమైనం దెచ్చెనా, యని తల్లిదండ్రులు జ్ఞాపకముండిరా యని యడిగిన నతం డిట్లనియె.

దేవా ! దేవర ఇదిగో నేను వైశంపాయునితో మాట్లాడి నీ వెనుకనే వత్తునని చెప్పితిరికదా. మేమట్లుపోయి మీ రాక వేచియుండ నెప్పటికి వచ్చితిరికారు. అప్పుడు పత్రలేఖయుఁ గేయూరకుఁడు నన్నుఁ జూచి మన చంద్రాపీడుని వర్షాకాలమగుటచేఁ దల్లితండ్రులు రానిచ్చిరి కారు. నీవిచ్చోట నొక్కరుఁడ వుండనేల ఇంటికిఁ బొమ్మని పలికి వారిరువురు హేమకూటమునకుఁ బోయిరి.

నేను మఱికొన్ని దినములందుండి తిరుగానింటికి వచ్చుచున్న వాఁడ. నింతియకాని వైశంపాయనుని వార్త నాకేమియుం దెలియదు. అతం డచ్ఛోదసరస్సునకుఁ బోవుటయే నే నెఱుఁగనని చెప్పినవిని యా రాజకుమారుఁడు వెండియు వానితో నోరీ ! అట్లైన సరియేకాని పత్రలేఖ యిప్పటికి హేమకూటముజేరునో లేదో చెప్పఁగలవా యని యడిగిన వాఁడిట్లనియె.

దేవా ! దైవికమైన యంతరాయమేదియు రాకుండిన నది యాలస్యము చేయునదికాదు. కావున నేటి కబ్బోఁటి హేమకూటము జేరుననియె. నా యభిప్రాయము అనిచెప్పిన సంతసించుచుఁ జంద్రాపీఁడుడు వానితోఁగూడఁ గ్రమంబున వైశంపాయనింజూచు వేడుకతో నచ్ఛోదసరస్సునకుఁ బోయి యందు గుజ్జుపురోతుల కిట్లనియె.

వైశంపాయనుఁడు వైరాగ్య వృత్తిబూని యీ వనములో నెచ్చటనో యణఁగియున్నవాఁడు. మనలనుజూచి పారిపోవును. కావున

చున్నదని చిత్తంబునం దలంచుచున్నవాఁడు. కాబోలు కానిమ్ము. నేనతనిం జూచి యేమియు మాట్లాడను. పాదంబులఁబడినను గ్రహింపను. మదలేఖా! నీవప్పుడు నాతో నేమియుం జెప్పవద్దుసుమీ! పెద్దతడవు చిక్కులుపెట్టి పిమ్మట మాటాడెదనని యతనిగురించిన మాటలే చెప్పుకొనుచు మార్గమున ఖేదము గురుతెఱుంగక క్రమంబున జంద్రాపీడునిఁ జూడ మిక్కిలి తొందరపడుచు నమ్మహాశ్వేతాశ్రమమునకు వచ్చెను.

అట్లు వచ్చి యందు అమృతరహితమగు సముద్రంబు చందంబున నున్ముక్తజీవితుండై పడియున్న చంద్రాపీడునిం జూచి కాదంబరి హా! ఇది యేమికష్టమని మూర్ఛాక్రాంతస్వాంతయై నేలం బడుచుండ మదలేఖ తటాలునఁ బడకుండ బట్టుకొనినది. పత్రలేఖయుఁ గాదంబరి యొక్క కైదండ విడిచి మోహావేశముతో నొడలెఱుంగక నేలం బడిపోయినది.

కాదంబరియుఁ గొంతసేపటికి దెప్పిరిల్లి మూఢయుంబోలె నేమియు నెఱుంగక యూర్పులు విడుచుట సైతము మరచి రెప్పవాల్పక నిశ్చలతారకలతో నతని మొగమే చూచుచు వ్రాయఁబడిన ప్రతిమవలె కదలక యట్లె నిలిచియుండం జూచి మదలేఖ యామె పాదంబులబడి సఖీ! నీవీ శోకమును విడువుము. స్వభావమృదు సరసమగు నీ హృదయము అతివృష్టి భారంబున విచ్చిన తటాకమువలె ఖేదిల్లును సుమీ! ఈతండు చైతన్యంబుబాసి పరలోకమున కతిథియైనట్లు తోచుచున్నది. ఇఁక వీనికొరకుఁ జింతింపనేల? యింటికిఁబోయి తల్లిదండ్రుల కామోదము గలుగఁజేయుము. నిన్నుఁజూడక వారు నిమిషము తాళలేరని పలికిన విని కాదంబరి నవ్వి యువ్విదుమోష్టి కిట్లనియె.

ఓసి వెట్టిదాన.! నా హృదయమును. మృదువుగా జెప్పుచుంటివేమి? వజ్రసారకఠినమైనది. కాకున్న నిట్టి యవస్థఁజూచియు బగులకుండునా? మఱియు జీవించువారికిగదా తల్లిదండ్రులు బంధువులు పరి

